క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ గ్రామమైన రామన్నపేటకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ గరుగుల నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ నేతుల దేవరాజ్‌యాదవ్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు రేకుల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్ గురువారం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది కూలీలకు డబ్బులు రావడం లేదని తెలపగా వెంటనే మండల ఏపీవో శ్రీహరితో ఫోన్లో మాట్లాడి సమస్యను ఆయన దృష్టికి వెళ్లారు. కూలీల పెండింగ్ డబ్బులు వెంటనే ఖాతాల్లోకి జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో గురువారం పోలీసులు, ప్రత్యేక బలగాలు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎనుమాముల సీఐగా ఆగ్రహారం వాసి



సీఐ రమేశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న దశరథం

ఎల్లారెడ్డిపేట: వరంగల్ జిల్లా ఎనుమాముల సీఐగా మండలంలోని ఆగ్రహారం గ్రామానికి చెందిన పులి రమేశ్ గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథం, రాజేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తైబజార్, పశువుల అంగడి వేలం

సిరిసిల్లటౌన్: తైబజార్, పశువుల అంగడికి వేలం వేస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య గురువారం తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ (తైబజార్), పశువుల అంగడి 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు ఏడాది పాటు నిర్వహణకు షీల్డ్ టెండర్లు ఆఫర్ చేస్తున్నామన్నారు. టెండర్లలో పాల్గొనే వారు ఈనెల 30 సా యంత్రం 5గంటల్లోపు కూరగాయల మార్కెట్‌కు రూ. 3లక్షలు డీడీ, రూ. 25లక్షల సాల్వెన్సీ స ర్టిఫి కె ట్, పశువుల అంగడికి రూ. 2లక్షలు డీడీ, రూ. 5లక్షలు సాల్వెన్సీ సర్టిఫికెట్ అందించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రమేశ్

సిరిసిల్లక్రైం: ప్రమాదాలను నివారించేందుకు పట్టణంలో రోజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. గురువారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకువెళ్లవద్దని సూచించారు.

కేజ్ కల్చర్‌పై ఆసక్తి

- బ్యాంకర్స్‌తో మత్స్యశాఖ క్యాంపులు
- మత్స్యకార్మికులకు సబ్సిడీ యూనిట్లు
- 122 మంది దరఖాస్తు



మత్స్యకార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు ముంపు గ్రామాల్లోని నిర్వాసిత మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కేజ్ కల్చర్‌ను ప్రవేశపెట్టింది. ఔత్సాహికులకు సబ్సిడీపై యూనిట్లు అందించేందుకు ప్రణాళికలు సైతం సిద్ధంచేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించింది. సబ్సిడీ యూనిట్లకు 122 మంది దరఖాస్తు చేసుకున్నారు.

12 గ్రామాలు..1600 మంది మత్స్యకార్మికులు

బోయినపల్లి మండలంలో నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పునరావాస కాలనీల్లోని మత్స్య కార్మికులకు మాత్రమే కేజ్ కల్చర్ యూనిట్ పథకం వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 440 వరకు చేపలు పెంచే చెరువులు ఉన్నాయి. 8,400 మంది మత్స్యకార్మికులు, 135 సొసైటీలు ఉన్నాయి. ముంపు గ్రామాల్లో 1600 మంది లైసెన్స్ గల మత్స్యకార్మికులు ఉన్నారు.

బ్యాంకర్స్‌తో క్యాంపులు

కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై సబ్సిడీ రుణాలు అందించనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.3లక్షల రుణం అందిస్తారు. ఇందులో జనరల్, బీసీ కేటగిరికి చెందిన వారికి 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం సబ్సిడీ ఉంటుంది. యూనిట్లపై మత్స్యశాఖ అధికారులు, ఎస్‌బీఐ, టీజీబీ, యూనియన్ బ్యాంకర్స్‌తో కలిసి ముంపు గ్రామాలైన సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, చీర్లవంచ, చింతలఠాణా, శాభాష్‌పల్లి, నీలోజిపల్లి, కొదురుపాక, వరదవెల్లి, మాన్వాడ ముంపు గ్రామాల్లో గతనెల 28 నుంచి ఈనెల 3 వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించినట్లు ఫిషరీస్ డీడీ శివ ప్రసాద్ తెలిపారు. బ్యాంకర్స్‌తో నిర్వహించిన క్యాంపుల్లో 122 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కొదురుపాక, రుద్రవరం నుంచి ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల జాబితాను జిల్లాస్థాయి కమిటీ ఆమోదించాక, రాష్ట్ర స్థాయి కమిటీకి వెళ్తుంది. అక్కడ ఆమోదం పొందాక యూనిట్లు గ్రౌండింగ్ అవడం ప్రారంభమవుతుందని, నెలవరకు యూనిట్ల స్థాపన జరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

వెయ్యి మందికి ఉపాధి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ ఆదేశాల మేరకు కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకంపై ముంపు గ్రామాల మత్స్య కార్మికులకు, బ్యాంకర్లతో కలిసి క్యాంపులు నిర్వహించారు. ఇందులో 122 మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు వెయ్యిమంది మత్స్యకార్మికులకు కేజ్ కల్చర్ యూనిట్లతో ఉపాధి కల్పించాలని భావిస్తున్నాం.

– జి.శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

మహిళల రక్షణే షీటీం లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ప్రమీల

కోనరావుపేట: మహిళలు, విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీటీంకు ఫిర్యాదు చేయాలని, మహిళల రక్షణే లక్ష్యంగా షీటీం పనిచేస్తోందని షీటీం ఏఎస్సై ప్రమీల అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, శివంగాలపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల, పాఠశాల విద్యార్థినులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు, పనిచేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే షీటీంకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సహాయం కోసం 8712656425లో లేదా 100కు డయల్ చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రియాంక, రమాదేవి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ జి.ప్రశాంత్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొదురుపాక, వెంకట్రావుపల్లి, వరదవెల్లి, నీలోజిపల్లి, మల్లాపూర్, మాన్వాడ, నర్సింగాపూర్, కొత్తపేట, జగ్గారావుపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

బోయినపల్లి: చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతీ పొలానికి సాగునీరందించాలన్న డిమాండ్‌తో ఈ నెల 29న గంగాధర మండలం కురిక్యాల బ్రిడ్జి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు అమిరిశెట్టి గంగయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ధర్నాలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, బీజేపీ కార్యకర్తలు, హాజరుకావాలని కోరారు.

బియ్యం పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి గ్రామ శివారులో ఆటోలో తరలిస్తున్న పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ ఆటోలో పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. శంకర్, సత్తయ్య అనే ఇద్దరు పీడీఎస్ బియ్యాన్ని వేములవాడలోని చెక్కపల్లి వెంకన్న రైస్‌మిల్‌లో విక్రయిన్నారని తెలిపారు. ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు దిగితే పల్టీలే..



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి వేములవాడ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల గత వానాకాలంలో కురిసిన వర్షానికి కోతకు గురైంది. ప్రధానంగా బోయినపల్లి కల్వర్టు మూలవద్ద రోడ్డు పక్కన కయ్య పడింది. ఎదురుగా వాహనాలు వస్తే ఎప్పుడు ఏ ప్రమా దం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

వృద్ధాశ్రమ వసతులపై అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో కల్పిస్తున్న వసతుల గురించి గురువారం వృద్ధాశ్రమ అధికారులు పలువురు వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంతోపాటు వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న నిరాశ్రయులకు అవగాహన కల్పించినట్లు కో–ఆర్డినేటర్ మమత తెలిపారు. ఎవరైనా వృద్ధులను ఆశ్రమంలో చేర్చాలంటే 8723293567, 8688716315 సంప్రదించా లని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో–ఆర్డి నే టర్ రమేశ్, ఫీల్డ్ రిసోర్స్ పర్సన్ సంతోష్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకు అండగా ప్రభుత్వం



వేములవాడ రూరల్: ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్



చందుర్తి: మల్యాలలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: రాష్ట్రంలో అన్నివర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నమిలిగుండుపల్లిలో మడేలేశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నట్లు తెలిపా రు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు వెంకటేశం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగస్వామి, పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల శ్రీశైలం, రజక సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పూజలు

చందుర్తి (వేములవాడ): మండలంలోని మల్యాల హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనపర్తి అనిత రాజు దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లారపు రాజయ్య, మాజీసర్పంచ్ దొంగరి భూమయ్య, నాయకులు సంటి ప్రసాద్, ఈసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి సహకారం అందించాలి



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట: సహకార సంఘాల అభివృద్ధికి రైతుల, సభ్యుల సహకారం అందించాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. మండల సింగిల్‌విండో మహాజన సభ గురువారం నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు వంటి వ్యాపారాలతో సంఘం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందన్నారు. సంఘం పరిధిలోని పెట్రోల్, డీజిల్ బంక్ త్వరలో పునర్ ప్రారంభం కానుందని, దీంతో సంఘం మరింత ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. గోరింటాలలో ఇప్పటికే గోదాం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే రైస్‌మిల్ ప్రారంభం కానుందన్నారు. సంఘం పరిధిలో 3,885 మంది సభ్యులు ఉన్నారని, రూ.2కోట్ల14 లక్షల వాటాధనం ఉందన్నారు. అధికారులు ఇప్పటివరకు 96 శాతం వసూలు చేశారన్నారు. రానున్న రోజుల్లో వందశాతం వసూళ్లు సాధించాలన్నారు. సంఘానికి ఇఫ్కో కంపెనీ సుమారు రూ. 8లక్షల విలువైన డ్రోన్‌ను సమకూర్చిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రోన్ వినియోగంపై రైతులకు కంపెనీ ప్రతినిధి నరేశ్ అవగాహన కల్పించారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, డైరెక్టర్లు ఎల్లవ్వ, రాజవీర్, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రావు, అంజిరెడ్డి, మురళి, నర్సయ్య, రమణ, బీమ్లా, దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, సీఈఓ రాజిరెడ్డి, మేనేజర్ సత్యంరావు, మాజీసర్పంచ్ శ్రీధర్‌పంతులు, రైతులు పాల్గొన్నారు.

ఫాజుల్‌నగర్‌కు చేరిన ఎల్లంపల్లి నీరు

- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాజెక్టులోకి గురువారం ఎల్లంపల్లి నీరు చేరింది. కొన్ని రోజులుగా నిలిచిపోగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో వరి పొలాలు సాగునీరు లేక ఎండిపోవడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదలను రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ప్రాజెక్టు వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, కొండాపూర్ గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు చేసి మద్యం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో మద్యం విక్రయించవద్దన్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలో బెల్ట్ దుకాణ నిర్వాహకులను ఇప్పటికే బైండోవర్ చేసినట్లు తెలిపారు.



ప్రమాదకరంగా కల్వర్టు

కోనరావుపేట: మండలంలోని నాగారం–మర్తనపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. మర్తనపేట శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న కల్వర్టు గతేడాది కురిసిన వర్షాలకు ఓ పక్క కోతకు గురైంది. దీంతో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా వెంటనే అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అర్ధనారీశ్వరుడికి.. అర్ధాంగిలుగా

- ఏటా శివకల్యాణం రోజు శివుడితో వివాహం
- వేములవాడలో వింతైన తంతు



శివకల్యాణోత్సవంలో తలంబ్రాలు చల్లుకుంటున్న శివపార్వతులు

వేములవాడ: లింగ, వయోభేదం లేకుండా... వివాహాలు చేసుకొని పిల్లలు కలిగినవారు, దంపతులు, హిజ్రాలు, జోగినులు ఇలా ఎములాడ రాజన్ననే అర్ధనారీశ్వరుడిగా పూజిస్తున్నారు. శివకల్యాణం రోజు వేములవాడకు వచ్చి రాజన్నను వివాహమాడుతున్నారు. ఏటా రాజరాజేశ్వర స్వామివారిని వివాహమాడుతున్న వైనంపై వారి మాటల్లోనే..

పెద్దల సూచనతో



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వరంగల్‌కు చెందిన స్నేహ. వారి పెద్దల సూచనలతో ఎములాడ రాజన్న ఆలయానికి వచ్చి నాలుగేళ్లుగా శివకల్యాణం రోజు శివుడిని వివామాడుతున్నట్లు చెబుతోంది. ఇలా వేలసంఖ్యలో వేములవాడకు చేరుకొని రాజన్ననే సరస్వంగా భావించి వివాహమాడుతుంటారు. ఈసారి కల్యాణ వేదికను బయట ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని స్నేహ తెలపుతోంది.

ఎనిమిదేళ్లుగా వివాహం..



హైదరాబాద్‌కు చెందిన ఎస్. మణి, సంగీత గృహిణులు. వీరు ఎనిదేళ్లుగా శివకల్యాణం రోజున వేములవాడకు చేరుకొని రాజన్న వివాహమాడుతున్నారు. మమ్మల్ని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు రాజన్నగానే కొలుస్తుంటారని, శివకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించడం ఆనందంగా ఉందని వారు చెబుతున్నారు. .

ఎనిమిదో సారి వేములవాడకు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వీరిద్దరు మంచిర్యాలకు చెందిన పుష్పలత, రమాదేవి. వీరు ఎనిమిదోసారి వేములవాడకు వచ్చారు. ఏటా శివకల్యాణోత్సవం రోజు రాజరాజేశ్వరుడిని పెళ్లాడతారు. ఇక్కడికి వస్తే ఆరోగ్యంతో పాటు కుటుంబాలు బాగుంటాయని నమ్మకం. రాజన్న ఆలయంలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

కొత్త ఆలోచనలతో ముందుకు

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో యువత కొత్త ఆలోచనలతో ముందుకెళ్తున్నారని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గాభవాని ఫ్లెక్సీ, ప్రింటింగ్ షాపును గురువారం ప్రారంభించారు.